## క్లుప్తంగా

### లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీ



దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆలయ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్‌గా దాచేపల్లికి చెందిన వేముల నరేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చల్లా సుబ్బలక్ష్మి, సభ్యులుగా స్వర్ణ శ్రీనివాసరావు, గుంజి పుల్లయ్య, వంటల వెంకటేశ్వర్లు, కోలా అప్పిరెడ్డి, యలమల వెంకటేశ్వర్లు, అన్నవరపు వెంకయ్య, దేవరశెట్టి నరసింహారావు, ముక్కపాటి వెంకట్రామయ్య, గుదె జానకీరామయ్య, పోతుల చంద్రం, ఇట్టెం వెంకటనర్సయ్య, మయికూరి కనకరావు, సాగి వెంకటేశ్వర్లు, తాయ పెద వెంకటప్పయ్య, నడిగడ్డ శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



దాచేపల్లి: నడికుడి దుర్గాపబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ బి.మల్లిఖార్జునశాస్త్రి ఆదివారం తెలిపారు. ఇటీవల సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న తమ విద్యార్థులు వై. నిరంజన్ డిస్కర్స్ త్రోలో ప్రథమ స్థానం, డిస్కర్స్ త్రో బాలికల విభాగంలో డి. సిరిచందన తృతీయస్థానం, బాలికల హైజంప్ విభాగంలో వి.యశస్విని ప్రథమ స్థానంలో నిలిచారని, వీరు ఈ నెలలో జరిగే రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీఈటీ బాజీబాబు, సాగర్ సిమెంట్స్ ప్రతినిధులు అభినందించారు.

### సాతులూరులో ఏకాహం




నాదెండ్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సాతులూరు గ్రామ దేవతల ఆలయంలో ఏకాహం ప్రారంభించారు. ఆదివారం ఉదయం 7 నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకూ ఏకాహం జరుగుతుంది. గ్రామానికి చెందిన ప్రసన్నాంజనేయస్వామి భజన బృందం నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం అమ్మవారికి పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించనున్నారు. గ్రామంలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు.

### ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన గరికపాటి ఆంజనేయులు, మల్లేశ్వరి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈవో కార్యాలయంలో ఆదివారం దాతలు ఆంజనేయులు, మల్లేశ్వరి దంపతులు ఈవో ఎస్.మాధవిదేవిని కలిసి విరాళం నగదు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దాతలు ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

### ఉచిత వైద్య శిబిరం



బొల్లాపల్లి : తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, స్త్రీల వ్యాధులు, ప్రసూతి వైద్యం, ఎముకలు, కీళ్లు, నరాలకు సంబంధించిన వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది రోగులకు సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నర్సింగ్ హోమ్ వైద్యుడు బొట్ల రఘుప్రసాద్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. బి.పార్వతి, బి.రంగతేజ, కె.శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక రసాయనాలతో అనర్థం

- సేంద్రియ వ్యవసాయంతో ఎంతో మేలు
- మోతాదు మించి ఎరువుల వాడకంతో భూసారం నిస్సారం
- వ్యవసాయాధికారుల సూచనలతో పంటల సాగు మంచిది

మాచవరం: ప్రతి ఏటా నూతన హైబ్రిడ్ విత్తన వంగడాల ఆవిష్కరణలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయి. హైబ్రిడ్ పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్న ఆకాంక్షలతో రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ముఖ్యంగా వరి, పత్తి, మిరప పంటల సాగులో రసాయన ఎరువులు వాడకం తప్పనిసరైంది. ఈ ఏడాది అనుకూలంగా వర్షాలు కురవడం, సాగర్ జలాలు రావడంతో రైతులు వరి, మిరప, పత్తి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువువలు వాడితే దిగుబడులు వస్తాయి అనే అవగాహన లేక రైతులు ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో పంటల్లో కలుపు పెరగడం, తెగుళ్లు ఆశించడం, భూసారం తగ్గిపోవడం లాంటి సమస్యలు ఏర్పడతాయి. పెట్టిన పెట్టుబడులకు సరైన దిగుబడులు లేక నష్టాల బారిన పడాల్సి వస్తుంది. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకం. భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎంతో మేలని, భూమిలో పోషక పదార్థాలను గుర్తించి దానికి అనుగుణంగా రసాయర ఎరువులు వాడాలని, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు బట్టి యాజమాన్య చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిన్నారు.



పొలంలో ఎరువు వేస్తున్న రైతు

**ఎరువుల ఎంపిక చాలా కీలకం...**

వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన రకాలను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని వరి, మిర్చి వంగడాలు నత్రజని ఆవశ్యకతపై ఆధారపడి ఉంటాయి. పంటల సాగుకు ముందే వేసవి దుక్కుల్లో పశువుల ఎరువులు, పొలంలో చెత్త కుళ్లి పోయేందుకు పొటాష్ లాంటి ఎరువులు, జీవాలను మండె కట్టడం లాంటివి చేస్తే మంచిది. పంటదశను బట్టి ఎరువులు వాడాలి.

**నేల స్వభావం ప్రకారం ఎరువులు ...**

ముందస్తుగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. నేల స్వభావాన్ని బట్టి ఎరువులను ఎంపిక చేసుకోవాలి. ఆమ్ల భూములైతే ఆమ్లత్వం కలిగిన ఎరువులు వాడరాదు. ఆమ్లం, చౌడు, సున్నం, క్షార భూములైతే భూసార పరీక్షల ఆధారంగా జిప్సం వాడుకోవాల్సి ఉంటుంది. భూసారాన్ని పెంచే సూక్ష్మపోషకాలు భూమికి అందించాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడితే మంచిది.

**సమతుల్య ఎరువుల వాడకం...**

భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయాధికారుల సూచలనతో పంటల సాగులో ఎరువులను సమతుల్య పద్ధతులతో వాడుకోవాలి. రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులను వాడితే భూమికి ఎంతో మేలు. ప్రతి పంటకు ముందస్తుగా పచ్చిరొట్ట పంటలు వేసి, భూమిలో కలియదున్నడం వలన భూమికి కావాల్సిన నత్రజని, పొటాషియం, భాస్వరం లాంటి ఎరువులు లభ్యమవుతాయి. సెమీ ఆర్గానిక్ విధానం పాటించే రైతులు బరువైన నేలల్లో అయితే 30:70 నిష్పత్తిలో, తేలిక నేలల్లో 40:60 నిష్పత్తిలో ఎరువులు వాడుకోవాలి. సేంద్రీయ ఎరువుల వాడకం వలన భూమిలో పోషక పదార్థాలు పెరుగుతాయి. దీంతో రైతులకు పెట్టుబడి తగ్గి, దిగుబడులు పెరుగుతాయి.

**ఎరువుల వాడకం తగ్గిస్తే మంచిది**



పంటల సాగులో ఎరువుల వాడకం తగ్గిస్తే చాలా మంచిది. ఎరువుల వాడకంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎరువులు చల్లే సమయంలో, రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో మాస్క్, రక్షణ దుస్తులు ధరించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గి, ఆదాయం పెరుగుతుంది.

– కె.రామమ్మ, వ్యవసాయాధికారిణి, మాచవరం

# హరనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో భ్రమరాంభికాదేవి అమ్మవారు



సత్రశాల దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దాత బొడపాటి రామకృష్ణ

సత్రశాల(రెంటచింతల): కైలాసనాథుడు శివయ్యకు ఎంతో ప్రీతికరమైన కార్తికమాసం సందర్భంగా ఆదివారం వందలాదిమంది భక్తులు అతిపురాతన శైవక్షేత్రంగా పేరుపొందిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజామునుంచే భక్తులు కార్తిక దీపాలు వెలిగించి కార్తిక పుణ్యస్నానాలు చేసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అర్చకులు మల్లిఖార్జుశర్మ నేతృత్వంలో స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించి హోమాలలో పాల్గొన్నారు. రెంటచింతల గ్రామానికి చెందిన బొడపాటి రామకృష్ణ దంపతులు వందలాది మంది భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలదారులకు అన్నదానం చేశారు. దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్**

విజయపురిసౌత్: విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా ఉంటాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. విజయపురిసౌత్‌లోని పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తుల భారీగా పాల్గొన్నారు. దీనికి ముందు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

# ఏఐఎఫ్‌టీయూ సదస్సును విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: విశాఖ పట్టణంలో ఈ నెల 9 తేదీన జరగనున్న ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్రసదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని లెనిన్ నగర్ కార్యాలయంలో ఏఐఎఫ్‌టీయూ అనుబంధం సంఘాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు నీలాద్రి రాంబాబు అధ్యక్షత కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నేత ఉల్లిగడ్డల నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. నేడు కార్మిక వర్గం, రైతాంగం అనేక సమస్యలను, సంక్షోభాలను, ఒత్తిళ్లను ఎదుర్కొంటుందన్నారు. దేశ కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి సాధించికున్న కార్మిక చట్టాలను పాలకులు రద్దు చేశారన్నారు. దీని ఫలితంగా కోట్లాది మంది కార్మిక వర్గం శ్రమ దోపిడీకి గురవుతుందన్నారు. సాధించికున్న కార్మికుల హక్కులన్ని కోల్పోతున్నామని తెలపారు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పీవీఎస్ స్వామి మాట్లాడుతూ కార్మికులు పోరాట శక్తిగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారు లింగయ్య, ఆంజనేయులు, కృష్ణ, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ఎం.వెంకటస్వామి, అనిల్, కోటి, సీహెచ్ వెంకటేశ్వర్లు, వెంకట్రావు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడికి సత్కారం



నాదెండ్ల: చిరుమామిళ్ల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు పి.ప్రవీణ్‌నాయక్ అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రెనర్‌గా గుర్తింపు పొందారు. ఇండస్ ఎడ్యుట్రిన్ ప్రైవేట్ లిమిటెడ్ (వీటీపీ) ప్రవీణ్ నాయక్ అందిస్తున్న ఉత్తమ శిక్షణను గుర్తించి, సత్కరించింది. సోమవారం ప్రవీణ్ నాయక్‌ను ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.

### రేపు శివనాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శివనాగేంద్రస్వామి ఆలయ 39వ వార్షికోత్సవాలు మంగళవారం జరగనున్నాయి. ఇదేరోజు నాగుల చవితి పర్వదినం నిర్వహించనున్నారు. 1985లో ప్రకృతి సిద్ధంగా పుట్ట వెలిసింది. అప్పటి నుంచి భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా భక్తులు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని, నాగుల చవితి పండగ సందర్భంగా వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటలకు పుట్టకు వార్లు పోయడం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం జెండా ఊరేగింపు, రాత్రి పలు భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం



నరసరావుపేట రూరల్: శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ యువజన మిత్ర బృందం సహకారంతో మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 250 మందికి శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 60 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిలో మొదటి విడతగా 30 మందిని పెదకాకాని శంకర కంటి హాస్పిటల్‌కు తరలించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బిపిన్, డాక్టర్ స్వాతి, సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు.

# దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు**



స్వాములకు సద్ది వితరణ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాల రూరల్: అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని వాగ్దేవి కళాశాల సమీపంలో నూతనంగా నిర్మాణం చేసిన అయ్యప్ప స్వామి వారి దేవస్థానం స్థలంలో స్వాముల సద్ది కార్యక్రమకు షెడ్డును ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు సద్ది వితరణ అందించారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, అయ్యప్ప స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**అభివృద్ధే లక్ష్యం..**

గురజాల: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద మోప్మా మహిళా పొదుపు సంఘాల మహిళలచే తయారుచేయబడిన ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకం మోప్మా బజార్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. నవులూరి పరంధామయ్య-సీతమ్మల జ్ఞాపకార్థం ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గురజాల నుంచి చర్లగుడిపాడు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# క్రీడాకారులకు డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ప్రోత్సాహం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హాస్పిటల్ ప్రతినిధి సత్యనారాయణ

నరసరావుపేట: డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఆ సంస్థ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ డాక్టర్ పరిటాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం హాస్పిటల్ ఎండీ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి (2024-25) అండర్ 14 బాస్కెట్‌బాల్ క్రీడల రెండో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి, ఆరోగ్యానికి తోడ్పాటు అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కనీసం అరగంట అయినా వ్యాయామం చేయాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని, శుభాకాంక్షలు తెలియజేశారు. 68 వ రాష్ట్రస్థాయి బాల బాలికల బాస్కెట్ బాల్ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ తెలియజేశారు. పోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి అండర్ 19 జట్టుకు ఎంపిక చేసి, ఈ నెల 18 నుంచి 24 వరకు చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

# రజక వర్గీయుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న రజక సంఘ నాయకులు

పిడుగురాళ్ల: రజకులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణ సమీపంలోని దేవరంపాడు నేతి వెంకన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన రజక కార్తిక వన సమారాధన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ... రజకుల అభివృద్ధి కోసం ఎప్పుడు ముందు ఉంటానని, అలాగే ఈ కార్తిక వన మహోత్సవాల వలన అందరిలో స్నేహభావం పెరిగి ఐక్యత పెరుగుతుందన్నారు. ప్రతి కార్తిక మాసంలో ఇటువంటి వన మహోత్సవాలు నిర్వహించటం ముదావహమన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును పట్టణ రజక సంఘ నాయకులు దుశ్శాలువాలతో సన్మానించి షీల్డ్‌ను ప్రదానం చేశారు. పిడుగురాళ్ల పట్టణ రజక సంఘ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత భగవద్గీత సారం తెలుసుకోవాలి



ప్రచారం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

చిలకలూరిపేట: త్రైత సిద్ధాంత భగవద్గీత సారం తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి సభ్యులు కోరారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని త్రైత సిద్ధాం త భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తిక మాసంలో దీపాలు వెలిగించడం వెనుక ఉన్న గూడార్థాన్ని తెలుసుకోవాలన్నారు. దీపాలు వెలిగించడం అంటే జ్ఞానాన్ని వెలిగించడమేనన్నారు. ప్రతి మనిషి శరీరం మట్టితో సమానం అని, దీప ప్రమిద తెలుపుతుందన్నారు. అందులోని రెండు ఒత్తులు జీవాత్మ, ఆత్మల కలయికకు గుర్తని వెల్లడించారు. ఒత్తులు వెలిగించే నిప్పు గురువు ఇచ్చే జ్ఞానాగ్ని అని పేర్కొన్నారు. మనిషి జీవితం, జన్మకు కారణమైన కర్మను నూనెగా భావించాలన్నారు. ప్రమిదలోని నూనె అయిపోయి రెండు వత్తులు కాలిపోయినప్పుడు మట్టి ప్రమిదలను పారవేయాలన్నారు. అంటే మనిషికి కర్మ అయిపోయి చనిపోయినట్లుగా భావన అన్నారు. సేవా సమితి సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, నారాయణమ్మ, గోపీ, అనురాధ, రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కుంకలగుంట పండుగ



నరసరావుపేట రూరల్: కుంకుల గుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15వ కార్తిక వన సమారాధన ఆదివారం కుంకులగుంట పండుగ వేడుకలు పేరిట రావిపాడు రోడ్డులోని శ్రీ కృష్ణచైతన్య కాలేజీలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలో స్థిరపడిన కుంకలగుంట వాసులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఈ వన సమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, కొల్లి బ్రహ్మయ్య, ఈఎం స్వామి, అత్తలూరి వెంకటేశ్వర్లు, షేక్ మహబూబ్ సుభాని, అర్వపల్లి హరనాథ్, ఎంపీటీసీ బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లో కూడా కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.

# నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలి

ఈపూరు : నకిలీ వరి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. మండలంలోని ఊడిజర్ల గ్రామ రైతులు నకిలీ విత్తనాలతో సాగు చేసిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఊడిజర్ల గ్రామంలో నందీశ్వర విత్తనాల కంపెనీ నుంచి బీబీటీ రకం వరి విత్తనాలను వందల ఎకరాల్లో సాగు చేశారని, విత్తనాల్లో లోపం ఉండటం వల్లనే పైరుకు పైరుకు ఒకే ఎకరంలో వ్యత్యాసం ఉందన్నారు. కేళీలు ఎక్కువగా ఉన్నాయని, దీని ద్వారా ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు నష్టం వస్తుందని వివరించారు. వీరిలో చాలా మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నందీశ్వర కంపెనీ ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు మాతకుంట సాయిరెడ్డి, రామిరెడ్డి, మూలె ఏడుకొండలురెడ్డి, టికెట్ శివయ్య, పెద్దిరెడ్డి, తాటి ఏడయ్య, కాశిరెడ్డి, కొండారెడ్డి, గురునాథరెడ్డి, సంజీవరెడ్డి, కుమార్‌రెడ్డి, యార్లగడ్డ అంజయ్య, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి ఉన్నారు.

# బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



వినుకొండ(నూజెండ్ల): మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇంతవరకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వలేదని, ప్రొవిజినల్ లైసెన్స్ మీద నడుస్తున్నాయని, దుకాణాల ఎస్టాబ్లిష్మెంట్ లైసెన్స్ ఇష్యూ వంటి అంశాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల మండలంలోని రవ్వవరం, కంభంపాడులో రెండు, వినుకొండ టౌన్‌లోని ఒక బెల్టుషాపు మీద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే పీడీ యాక్ట్ కూడా ప్రయోగిస్తామన్నారు. బెల్టు షాపుల నిర్వహణపై వివరాలు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

### జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి అంతర్ విశ్వ విద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి బి.ప్రభంజన్‌కుమార్ సింగ్ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు ఆదివారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో ప్రభంజన్ ప్రతిభ కనపరిచి ఎంపికైనట్టు వివరించారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు జమ్మూ విశ్వవిద్యాలయంలో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల ఫెన్సింగ్ పోటీల్లో ప్రభంజన్ ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు విద్యార్థి ప్రభంజన్‌ను అభినందించారు.